# కాలంలో ప్రయాణం

## TIME TRAVEL

సైన్సు ఫిక్షన్, తెలుగు చరిత్రల సమ్మేళనంతో నడిచిన నూతన నవల



మన్నె సత్యనారాయణ

# కాలంలో ప్రయాణం

(TIME TRAVEL)

సైన్సు ఫిక్షన్, తెలుగు చరిత్రల సమ్మేళనంతో నడిచిన నూతన నవల

మన్నె సత్యనారాయణ

# ముందుమాట

ఈ శతాబ్దం పూర్తయ్యేసరికి, మానవజాతి ఎలా వుండబోతోందో అంటూ డాక్టర్ మిచియోకాకు ఊహాజనిత, 'ఫిజిక్స్ ఆఫ్ ది ఫ్యూచర్' (Physics of the Future) అనే పుస్తకాన్ని వ్రాసారు. అయితే అది ఊహేనా అంటే, కాదనిపిస్తుంది ఆ ఊహకు స్ఫూర్తి మూడువందల శాస్త్రవేత్తల ఆలోచనలేనట!

మన్నె సత్యనారాయణగారు ఏకంగా కాలంలోనే ప్రయాణం పెట్టుకున్నారు. ఆ ప్రయాణం కేవలం ముందుకే కాదు, గతకాలంలోకి ప్రయాణిస్తాడు టైమ్ ట్రావెలర్! అలా వెళ్ళడమేకాదు. ఆనాటి శ్రీకృష్ణదేవరాయలను చూసి, ఆయన రాణుల గూర్చి నిజాలు తెలుసుకుని, ఆయన మంత్రివర్గాన్ని, సేనాధిపతులను, సామంత రాజులను, వారి రాజ్యవ్యవస్థనూ పరికించి, ఆ విషయాలను మనకందచేస్తాడు.

అనాదిగా మనది ముఖ్యంగా వ్యవసాయ దేశం. రాయ కాలంలోని వ్యవసాయం, నాటి వనరులనూ పరిశీలించడమే కాకుండా, రైతులకు కావలసిన నీటి వనరుల ఆవశ్యకతను గుర్తించి, వాటికి కావలసిన నిర్మాణాలను చేపట్టమని రాయలు వారికి టైమ్ ట్రావెలర్ సూచించడం, వారు దానికి సమ్మతించి వాటిని చేపట్టడం గొప్ప విషయం. నిజానికిది ఏ కాలంలోనైనా చేపట్టవలసిన కార్యక్రమం కదా!

రాజుల కాలంలో, ముఖ్యంగా ధనికుల భోగలాలసతకు భోగం స్త్రీలుండేవారు రాయల కాలం అందుకు భిన్నం కాదని తెలుసుకుని, అలాంటి ఒక భోగం మహిళతో సంభాషణ సాగిస్తాడు టైమ్ ట్రావెలర్. ఆవిడ పేరు మధురవాణి. ఆవిడ తనకా జీవితం ఎంత మానసిక క్షోభను కలిగిస్తున్నదో హృదయ విదారకంగా చెప్పుకుంటుంది. సమాజంలోని కొందరి స్వార్థం కోసం నియమింపబడిన ఈ కులంలోని కొందరు స్త్రీలలోని మానసిక సంఘర్షణను ఆవిష్కరిస్తుంది. వీరిద్దరి మధ్య ఆ సన్నివేశం!

ఇందులో మన టైమ్ ట్రావెలర్ మరింత కాలం వెనక్కు వెళ్ళి, రాజరాజనరేంద్రులవారిని, తెలుగు భాషకు ఆదికవి అనిపించుకున్న నన్నయభట్టుగారిని, వారి మిత్రుడు, గొప్పకవి అయిన వాణసనారాయణ భట్టుగారినీ

సందర్శించి, వారితో సంభాషణలు కొనసాగించి, కొన్ని చారిత్రక సత్యాలను తెలుసుకోవడానికి ప్రయత్నించాడు.

అలా మనందర్నీ కూడా, టైమ్ ట్రావెలర్‌తో పాటు గతంలోకి తీసుకువెళ్ళి, తిరిగి వర్తమానం లోకి తీసుకువచ్చి, భవిష్యత్తు వైపుగా తీసుకువెళ్ళి ఎన్నెన్నో చారిత్రక సత్యాలను, సాంకేతిక పురోభివృద్ధి నీ మన కళ్ళముందుంచారు రచయిత.

ఇది ఊహ కావచ్చు కాని, నిజం అనిపించే విధంగా "కాలంలో ప్రయాణం" అనే నవలను రూపొందించారు మన్నె సత్యనారాయణగారు. అసలు పూర్వం మన ఋషులు భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలలోనికి సంకల్పమాత్రంగా వెళ్ళగలిగేవారని ఎన్నో కథలు మన ప్రాచీన వాఙ్మయం మనకందించింది. అవన్నీ పుక్కుడి పురాణాలని, హేతువాదానికి అందవని అంటారు కొందరు. అయితే, శాస్త్రీయపరంగా ఆలోచిస్తే మేధను మనసునూ సమన్వయపరచి, ఏకాగ్రతతో ధ్యానంచేస్తే వ్యక్తికి పంచేంద్రియాలకూ అందని విషయాలు కూడా గోచరిస్తాయని, అది సాధ్యమేనని ఇప్పుడు శాస్త్ర వేత్తలు కూడా అంటున్నారని రచయిత అభిప్రాయం. ఆ రీతిగా పరిశోధనలు జరుపుతున్న మాట వాస్తవం. ఏమో! ఈనాటి ఊహ ఒకనాటికి నిజం కావచ్చును!

"గతం, వర్తమానం, భవిష్యత్తు అనేవి కాల విభజన కోసం మనం పెట్టుకున్న పేర్లు. కాలం మాత్రం ఒకే సరళరేఖ! ఒకే సరళమార్గం" అంటూ ఆధ్యాత్మికతను, సాంకేతిక భౌతిక శాస్త్ర పరిజ్ఞానాన్నీ మేళవించి, "కాలంలో ప్రయాణం" అనే విలక్షణమైన నవలను ఆద్యంతమూ ఉత్సుకత రేకెత్తించే విధంగా మలిచారు రచయిత. ఎప్పటికైనా వారి ఊహ నిజం కావచ్చునేమోనన్న ఆలోచన పాఠకులకు రాకపోదు.

హైదరాబాదు — వి.యస్. రమాదేవి

9-2-2012 — మాజీ గవర్నర్,

హిమాచల ప్రదేశ్, కర్నాటక

రచయిత విన్నపం

## ఒక చిన్న మాట

అసలు వాస్తవానికి, నాకేమీ తెలియదు. నాకేమీ తెలియదనే విషయం తెలియడానికి కొంతకాలం పట్టింది ఏమీ తెలియదని తెలిసాకా, తెలుసుకోవడానికి ప్రయత్నం ప్రారంభించాను. ఒక సాధారణ ఆలోచనాపరుడు కాని, మేధావి కాని తెలుసుకోవడానికి చేసే ప్రయత్నంలో, వారి సాధన మేరకు సత్యాన్ని వివిధ స్థాయిలలో తెలుసుకోగలుగుతారు. అయితే, అంతిమ సత్యం (Ultimate Truth) ను మాత్రం మనిషి ఎప్పటికీ తెలుసుకోలేడు.

కాలంలో ప్రయాణం అనేది. ప్రస్తుతానికి ఊహాత్మక ప్రతిపాదన (Hypothesis). ఈ ఊహకు శాస్త్రీయ ఆధారం కొంత వుంది. అది, '4 - డైమన్షనల్ కంటిన్యుమ్' అనే సిద్ధాంతం దీనిని ఈ నవలలో కొద్దిగా వివరించాను.

ఈ నాటికి శాస్త్ర విజ్ఞానం చేరిన స్థాయినీ, అది పురోగమిస్తున్న వేగాన్ని పరిగణలోకి తీసుకోవాలి. సంక్లిష్టమైన యంత్రం నుండి ప్రజలు వాడుకొనే చిన్న చిన్న వస్తువుల తయారీ వరకూ వృద్ధి చెందిన శాస్త్రవిజ్ఞానాన్ని తెలియజేస్తాయి ఒకనాడు అసంభవం అనుకొన్న సాధనాల్ని ఈనాడు శాస్త్రవిజ్ఞానం సాధించి చూపిస్తున్నది

మనిషి చేసిన ప్రతి ఆవిష్కరణ ఊహతోనే ప్రారంభమవుతుంది. ఆ ఊహను, లేదా ఆలోచనను మథించి ప్రయోగం జరిపితే సిద్ధాంతంగా రూపొందుతుంది. అందుకే, "రోజువారీ ఆలోచనల మేలిమి రూపమే సిద్ధాంతం" అని ఆల్బర్ట్ ఐన్స్టీన్ అన్నారు.

ఈ విశ్వంలో మానవుడు ఒంటరిగా లేడు. పకృతిలోని జీవ, నిర్జీవ అంశాలెన్నో మనిషికి సహచరులుగా ఉంటున్నవి. ఈ అంశాలు మనిషియొక్క పురోగతికి, మనుగడకు తోడ్పడుతున్నాయి. ఈ అంశాల సహాయంతోనే, పకృతిలో అంతర్లీనంగా ఉన్న సూత్రాలను మనిషి తెలుసుకోగలుగుతున్నాడు. ఉన్నవాటిని తెలుసుకొంటున్నాడు. అంతేగాని మానవుడు కొత్తగా దేనినీ ఉత్పత్తి చేయడం లేదు. పకృతి సూత్రాలతో కొత్త సమీకరణలు చేసి కొన్ని ఫలితాలను చూస్తున్నాడు ఈ

ఫలితాలనే 'ఆవిష్కరణలు' (Inventions) అంటున్నాము. వాస్తవానికి ఇవి Inventions కావు. Discoveries(దర్శనాలు) మాత్రమే. ఈ వాస్తవాన్ని అంగీకరించగలిగితే, మనిషిలోని అహంకారం అణిగి ఉంటుంది. జ్ఞానం పెరుగుతుంది!

కాలంలో ప్రయాణం అనే ఊహ కొత్తదేమీ కాదు. హెచ్.జి.వెల్స్, ఐజాక్ ఇసనోవ్ లాంటివారు ఇదివరలో ఇంగ్లీషులో ఈ సబ్జెక్టుతో నవలలు వ్రాసారు. వారు ప్రసిద్ధ రచయితలు. ఈ సబ్జెక్టుతో వ్రాయాలని నాకు అనిపించినపుడు, అంతటి ప్రసిద్ధ రచయితలు వ్రాసాక మళ్ళీ ఎందుకు నేను వ్రాయాలనిపించింది. అయితే వారు ఇతర భాషల్లో, ఆయా దేశాల సంస్కృతుల నేపధ్యంలో వ్రాసారు. ఇప్పుడు, నేను తెలుగులో తెలుగు సంస్కృతి నేపధ్యంలో వ్రాయాలనిపించింది. అలాగే, టైమ్ ట్రావెల్ అనేది ఫిక్షన్! ఆ నవలల్లో టైమ్ ట్రావెలర్ వెళ్ళింది కూడా కల్పనా కాలంలోకి! కాని, ఈ నవలలో టైమ్ మిషిన్ సహాయంతో, టైమ్ ట్రావెలర్ తెలుగు చారిత్రక కాలంలోకి వెళతాడు. అందువలన అప్పటి తెలుగు చరిత్రను పరిశీలనగా చెప్పవచ్చుననిపించింది.

తెలుగు చరిత్రలో ప్రాధాన్యత కలిగిన రెండు సంఘటనా కాలాల్లో కి-విజయ నగర సామ్రాజ్యంలో శ్రీకృష్ణ దేవరాయలు కాలంలోకి, తరువాత నన్నయ, రాజరాజ నరేంద్రుల కాలంలోకి- వెళతాడు. ఇది చరిత్ర గనుక, చారిత్రక వాస్తవాలకు దగ్గరగా వ్రాయడానికి ప్రయత్నించాను. టైమ్ ట్రావెలర్ విజయనగరంలో రాయల దగ్గరనుండి, రైతు వరకూ అన్ని వర్గాల ప్రజలను కలుస్తాడు. ఆయా వర్గాల ప్రజల జీవన విధానాలను పరిశీలిస్తాడు. ఆనాటి రాజ్య వ్యవస్థ, సమాజ జీవితం, ఆర్థిక పరిస్థితులు, వ్యవసాయం, కుల వృత్తులూ మొదలైనవాటిని పరిశీలిస్తాడు.

ఈ పరిశీలనకోసం, నేను ప్రత్యక్ష సాక్షుల కధనాలను ప్రామాణికంగా తీసుకొన్నాను. పోర్చుగీసు ఇండియా గవర్నరు ప్రతినిధి అయిన క్రిస్టోవావ్ డీఫిగ్విరిడో బృందంలోని వాడు డొమింగో పెయిజ్. ఈ పోర్చుగీసు యాత్రికుడు రాయలవారిని కలిసాడు. అప్పటి ప్రజల జీవన స్థితిగతులు వ్రాసాడు - ఇదంతా ఒక గ్రంథంగా వ్రాసాడు. రాయలవారి తరువాత కొద్ది సంవత్సరాలకు, పెర్డినావో న్యూనిజ్ విజయనగరం సందర్శించాడు. అతను చూసినవీ, విన్నవీ అన్నీ గ్రంధస్థం చేసాడు. ఈ ఇద్దరు

పోర్చుగీసువారూ వ్రాసిన గ్రంధాలలోని సమాచారాన్ని నేను ప్రామాణికంగా తీసుకొన్నాను.

రాజరాజ నరేంద్రుని కాలంలోని రాజమహేంద్రవరం గురించి వ్రాసాను. టైమ్ ట్రావెలర్, నన్నయ్యగార్ని కలిసినప్పుడు చరిత్రలో మనకు అస్పష్టంగా ఉండిపోయిన కొన్ని విషయాలగురించి అడిగి తెలుసుకుంటాడు.

రాయల కాలంలోని వ్యవసాయం గురించి, కొన్ని మౌలిక వసతుల కల్పన గురించీ చెప్పడానికి ప్రయత్నించాను. ఎందుకంటే, అప్పుడు వారు తవ్వించిన వ్యవసాయ కాలువలు, ఇతర నీటి వనరులూ ఇప్పటికీ కొంతమేరకు ఉపయోగపడుతున్నవి.

ఈ నవల చదువుతున్నప్పుడు విజ్ఞులైన వారికి కొన్ని సాంకేతికపరమైన లోపాలు తోచవచ్చును. చరిత్రపరంగా కొన్ని సందేహాలు కలుగవచ్చును. నిజమే, కలగవచ్చును. ఎందుచేతనంటే, నేను శాస్త్రవేత్తను కాను. చరిత్రకారుడనూ కాను. ఇది సాధారణ పాఠకుల నుద్దేశించి వ్రాసినది.

ఇది, ఒక ప్రాధమిక ప్రతిపాదనతో జరిపిన కథనం!

తణుకు మన్నె సత్యనారాయణ

534211

16-2-2012

# కాలంలో ప్రయాణం
## TIME TRAVEL

- మన్నె సత్యనారాయణ

### తెలుగుజాతి ప్రస్థానానికి ఓ చిరుదీపం!

***(విభిన్నకాలాలకు చెందిన తెలుగువారి సామాజిక, ఆర్థిక, సాహిత్య, సాంస్కృతిక జీవన విధానాలను చిత్రించి కథనం చేయబడిన నవల. ఈ భిన్నకాలాలను అనుసంధానపరచిన అంశం 'కాలం!')***

❄ ❄ ❄ ❄ ❄

ఆనందరావు శాస్త్రవేత్తకాదు, చరిత్రకారుడూ కాదు. ఆ ఊరిలో వ్యవసాయం చేసుకొనే ఒక యువకుడు. అతను బాగానే చదువుకున్నాడు. అతని తాత తండ్రులు సరిపడ భూమిని సంపాదించి ఇచ్చారు. ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ, ఆ ఊళ్ళోనే గడపాలని నిర్ణయించుకున్నాడు. అక్కడే పుట్టి పెరిగాడు.

చదువుకున్నాడు కదాఅని మరీ శాస్త్రబద్ధంగా వ్యవసాయం చెయ్యడు. సాంప్రదాయపద్ధతులకు కొన్ని ఆధునిక పద్ధతుల్ని మేళవించి సాగుచేస్తుంటాడు. ఇతర రైతులకుకూడా సూచనలిస్తూ ఉంటాడు.

ఆనందరావు విద్యార్థిగా సైన్సుపాఠాలు చదువలేదు. కానీ శాస్త్రపరిజ్ఞానం గురించీ, కొత్త ఆవిష్కరణల గురించీ పుస్తకాలు, జర్నల్సూ చదివి తెలుసుకోవడం అతనికి ఆసక్తి! ఆ విషయాల గురించతను మాట్లాడు తుంటే, మంచి శాస్త్రపరిజ్ఞానం ఉన్నవాడిగా అనిపిస్తాడు. ఏమీ తెలియని వాడిలాగే ఉంటాడు. చదువు కున్న వారితో విద్యావంతుడిలాగా మాట్లాడతాడు. అంతగా చదువుకోని ఆ ఊరి ప్రజలతో వాళ్ళ వ్యవహారిక పరిభాషలోనే మాట్లాడతాడు. చారిత్రకవిషయాలన్నాకూడా అతనికి ఆసక్తి.

ఒకనాడతను కాలవవతలి పొలం వెళ్ళవలసి వచ్చింది. పాలేర్లు, పనివాళ్ళూ పల్లపు పొలంలో పని చేస్తున్నారు. తప్పనిసరి మూలాన మధ్యాహ్నపువేళైనా తానే వెళ్ళాడు. అక్కడ పనిచూసుకుంటున్నాడు. మధ్యాహ్నం ఎండమూలాన అక్కడ పొలాల్లో ఎవరూ లేరు.

అతనిచేలోనే ఒక మూల కొద్దిపాటి ఎత్తుగా మట్టిదిమ్మ ఉంది. అక్కడకతను కాస్త దూరంలో ఉండగా, ఆ దిమ్మమీద ఎక్కువ ఒత్తిడితో గాలివీచింది. రివ్వురివ్వుమని వీచిన ఆ గాలి శబ్దం అతనికి వినపడింది. అయితే, అతనున్నచోటగాని, దిమ్మవెలుపలగాని ఆ గాలి ఒత్తిడిలేదు. ఏదైనా సుడిగాలేమో అనుకున్నాడు. అప్పుడప్పుడు పొలాల్లో చిన్న సుడిగాలులు వీచిపోతుంటాయి. కానీ, అలా కాకుండా ఆ గాలి వీచిన తీవ్రత బాగా ఎక్కువగా ఉంది.

కొద్ది క్షణాల తర్వాత ఆ గాలి శబ్దం ఆగింది. అతనికక్కడేమీ కనిపించలేదు. దిమ్మమీద పచ్చిక కనిపిస్తోంది. ఏదోలే అనుకున్నాడు. కానీ, ఒక అరనిముషము తర్వాత అక్కడొక వ్యోమ నౌకలాంటి వాహనం కనిపించింది! అతనాశ్చర్యపోయాడు. ఆశ్చర్యపోయింది, వ్యోమనౌకలాంటి దాన్ని చూసినందుక్కాదు. కొద్ది క్షణాలముందది అక్కడలేదు. తాను చూస్తూనే ఉన్నాడు. ఆకాశం నుండి దిగలేదు. మరిప్పుడా వాహనమెలా వచ్చింది? అనుకున్నాడు. దగ్గరికెళ్ళి చూద్దామా అనుకున్నాడు. కానీ, అదేమిటో, వెళ్ళచ్చునో లేదో ననే సంశయముతో ఆగి నిలబడ్డాడు.

ఇంతలో ఆ వాహంనం తలుపు తెరుచుకొంది. ఓ వ్యక్తి లోపలనుండి బయటకొచ్చాడు. కానీ అతను వ్యోమగామిగా లేడు. అతని ఒంటిమీద వ్యోమదుస్తులు, అలాంటి ఇతర పరికరాలు లేవు. మరితనెవరు? ఆ వాహనమేంటి? అనుకున్నాడు.

ఆ వ్యక్తి ఆనందరావును చూసాడు. ఒక్క నిముషమాలోచించి, ఆనందరావువైపు వస్తున్నాడు. ఆనంద రావుకూడా ముందుకడుగులు వేసాడు. అతన్ని కలవగానే 'ఏ భాషలో మాట్లాడాలి? అతనెక్కడినుంచొచ్చాడు' అనుకున్నాడు. ఇద్దరూ దగ్గరయ్యారు. నిలబడ్డారు.

“నమస్కారం. ఇది ఆంధ్రదేశంలోని రామాపురం అనే ఊరేనా?” అని అచ్చమైన తెలుగులో ఆ కొత్తవ్యక్తి అడిగాడు.
‘అరె! ఇతనికి తెలుగొచ్చు!’ అనుకొని అతన్ని ఎగాదిగా చూసాడు ఆనందరావు. అతని బట్టలుమాత్రం కొత్తగానూ, భిన్నంగానూ ఉన్నవి. తానెరిగినంతవరకూ, ఇలాంటి దుస్తుల్ని ధరించిన ఏ దేశంవాళ్ళనీ ఆనందరావు చూడలేదు.
“అవును, ఇది ఆంధ్రదేశమే, ఈ ఊరు రామాపురం. మీకు తెలుగొచ్చునా?” అన్నాడు.
“నేను తెలుగువాడినే” అన్నాడు ఆ కొత్తవ్యక్తి.
“మీరు తెలుగువారా? మరి... ఆ వాహనమేంటి? అది పైనుంచిగాని, ఏ ప్రక్కనుంచిగాని రావడం కనిపించలేదు. అకస్మాత్తుగా ఎలావుందక్కడ? మీరెవరు?” అని ఆత్రుతగా అడిగాడు ఆనందరావు.
“ముందుగా కొన్ని ప్రశ్నలడుగుతాను. మీరు జవాబులివ్వండి. తర్వాత అన్నివిషయాలు మీకు వివరంగా చెబుతాను, దాపరికమేమీ ఉండదు” అన్నాడతను.
“అలాగే అడగండి” అన్నాడు ఆనందరావు. అతని దుస్తుల్ని మరొకసారి చూసాడు.
“ఇది 2010 సంవత్సరమేనా?” అని అడిగాడాకొత్తవ్యక్తి.
“అదేంటి! ఇదేసంవత్సరమో మీకు తెలియదా?”
“తెలుసు. రూఢీచేసుకోవడానికి అడుగుతున్నాను”
“అవును. 2010 సంవత్సరమే”
“మీదీవూరేనా?”
“ఈ ఊరే”
“ఈ ఊళ్ళో వాసిరెడ్డి రఘురామయ్యగారు అనే వ్యక్తి, అతని కుటుంబం ఉంటున్నారా?”
‘ఇదేంటి ప్రత్యేకంగా అతన్నడుగుతున్నాడు?’ అనుకున్నాడు ఆనందరావు. సరే అదే తెలుస్తుందిలే తర్వాత అనుకున్నాడు.
“అవును, ఉంటున్నారు”.
“మీరు బాగా చదువుకున్నారా? సైన్సా, లేక వేరే ఏదైనానా? సైన్సు విషయాలమీద ఆ పరిజ్ఞానం మీద మీకు ఆసక్తి ఉందా?”
“నేను బాగానే చదువుకున్నాను. కాని సైన్సు సబ్జక్టుకాదు. అయినా కూడా నాకు శాస్త్రీయపరిజ్ఞానంమీద చాలా ఆసక్తి ఉంది. పుస్తకాలు చదివి తెలుసుకుంటూ ఉంటాను. చారిత్రక విషయాలన్నాకూడా ఆసక్తి ఎక్కువే” అన్నాడు ఆనందరావు.
“సరే నేను మిమ్మల్ని నమ్ముతాను. నాకు మీ సహకారం కావాలి” అన్నాడా వ్యక్తి.
“నన్ను మీరు నమ్మవచ్చును. నాకు చేతనైన సహకారం చేస్తాను. అసలు విషయం చెప్పండి.”
“మీకు నేనో అద్భుతమైన విషయాల్ని చెబుతాను. మీకు ఆశ్చర్యం కలుగుతుంది. దీన్ని శాస్త్రబద్ధంగా అర్థం చేసుకోవాలి. తెలిసిన సమాచారాన్ని గుట్టుగా ఉంచాలి.” అన్నాడావ్యక్తి.
“అలాగే, మీ నమ్మకాన్ని నిలబెడతాను. చెప్పండి.”
“నేను తెలుగువాడినే. కానీ, ఇప్పటివాణ్ణికాదు. ఇప్పటికి 200 సంవత్సరాల తర్వాతవాణ్ణి!” అన్నాడావ్యక్తి.

ఆనందరావు ఆశ్చర్యపోవడమేకాదు, అసలు తానేమి వింటున్నాను, ఇతను చెబుతోంది నిజమా అనుకున్నాడు.
“200 సంవత్సరాల తరువాతవారంటే - మీరసలు ఇప్పటికి పుట్టనేలేదు కదా! మరిప్పుడెలా కనిపిస్తున్నారు?” అన్నాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=653**

* * *